క్లుప్తంగా

సీఎం జగన్ పాలనలో సుభిక్షంగా ప్రజలు

మైలవరం: మైలవరం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఉగాది శుభాకాంక్షలు బుధవారం తెలిపారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. శ్రీశోభకృత్ నామ సంవత్సరం ప్రజలకు ఏడాది అంతా శోభాయమానంగా ఉంటుందని తెలిపారు.

సత్యమార్గాన్ని అనుసరించాలి



పశ్చాత్తాప పాదయాత్రలో జపమాల ఆలపిస్తున్న ఫాదర్

ఇబ్రహీంపట్నం: ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు సత్య మార్గాన్ని అనుసరించాలని ఆర్సీఎం విచారణ గురువు ఫాదర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఏసుక్రీస్తు శ్రమదినాలు పురస్కరించుకుని పశ్చాత్తాప పాదయాత్ర బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువలో పాపపరిహార బలి అర్పించారన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి వివిధ గ్రామాల మీదుగా మూలపాడు మహిమలగిరి పుణ్యక్షేత్రం వరకు 65వ నంబర్ హైవే వెంట పాదయాత్ర సాగింది.

భగత్ సింగ్ ఆశయాలు ఆదర్శం



భగత్ సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో బుధవారం కులవివక్షత పోరాట సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్ సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని శాఖ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం సూచించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్ము మోహనరావు, లక్ష్మణరావు, చంటి పాల్గొన్నారు.

రేపు కళాకారుల సమ్మేళనం

తిరువూరు: రంగస్థల నటులు, కళాకారులతో తిరువూరులో ఈ నెల 24న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి నాట్య మండలి, శ్రీవీరాంజనేయ నాట్యమండలి ప్రతినిధులు తెలిపారు. అంతరించిపోతున్న రంగస్థల, పద్యనాటక రంగాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడం, కొత్త కళాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. తిరువూరు పాత శివాలయంలోని త్యాగరాజ గానకళాసమితి వేదికపై సాయంత్రం ఆరు గంటలకు జరిగే కార్యక్రమంలో కళాకారులు పాల్గొనాలని కోరారు.

భారత్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రామిశెట్టి వెంకట సత్యనారాయణ

నూజివీడు: భారత్ బార్ అసోసియేషన్ నూజివీడు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది వైఎస్ దొరై బుధవారం తెలిపారు. అధ్యక్షుడిగా రామిశెట్టి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దార్ల కుమారి, కార్యదర్శిగా బసవరాజు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చీపు అర్జునరావు, కోశాధికారిగా బూరుగు దేవదానం, లైబ్రేరియన్‌గా టి.జీవిత ఎన్నికైనట్టు పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ



వృద్ధులకు వస్త్రదానం చేసిన పకీరయ్య కుటుంబ సభ్యులు

జి.కొండూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధి వెలగలేరు సాయిబాబా ఆలయంలో చనమోలు పెత్తందారు పకీరయ్య, వెంకట జలజమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు చనమోలు నర్సింహస్వామి, యలమంచిలి విజయ్‌కుమార్ వృద్ధులకు బుధవారం వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో పకీరయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సెమ్మెస్, వాట్సాప్ మెసేజ్‌లు చేసి మహిళను వేధిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపాలేనికి చెందిన సీహెచ్ లక్ష్మి భర్త నుంచి విడిపోయి ఒంటరిగా జీవిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి 15 రోజులుగా వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘శోభకృత్’లో శోభాయమానం

ఘనంగా ఉగాది వేడుకలు

జిల్లాలో శ్రీ శోభకృత్ నామ ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. పలుచోట్ల పంచాంగ శ్రవణం నిర్వహించారు.



ఆగిరిపల్లి వేద పాఠశాలలో పంచాంగ శ్రవణం

తిరువూరు: తెలుగు ఉగాది పర్వదినాన్ని బుధవారం తిరువూరు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని షిర్డిసాయి మందిరం, వేంకటాచల స్వామి దేవస్థానాలలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరం అంతా ప్రజల జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని అర్చకులు ఆశీర్వదించారు.

మైలవరంలో..

మైలవరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం, వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, లక్ష్మీగణపతి ఆలయం, శ్రీపాండురంగస్వామి ఆలయాల్లో ఉగాది సందర్భంగా స్వామివార్లను పూలమాలలతో అలంకరించారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: ఉగాది పర్వదినాన్ని మండలంలో సంప్రదాయంగా బుధవారం జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అర్చకులు పంచాంగం శ్రవణం చేశారు.



విస్సన్నపేటలో చంద్రశేఖరస్వామికి ప్రత్యేక అలంకరణ

ఘనంగా ఉగాది

చాట్రాయి: మండలంలోని ప్రజలు బుధవారం ఉగాది పండగను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల, షాపులను మామిడి తోరణాలతో అలంకరించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయాల్లో పూజలు చేసి, ఉగాది పచ్చడి, పులుసులను స్వీకరించారు. ఉగాది పంచాంగాన్ని పండితులు వినిపించారు. చనుబండలో కోదండ రాముడిని ఊరేగించారు.


సిద్ధి గణపతి ఆలయంలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని సిద్ధి గణపతి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు హరికృష్ణ, రమణ పాల్గొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, పోలిశెట్టిపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం పలు గ్రామాల్లో బుధవారం ఉగాదిని ఘనంగా నిర్వహించారు.

మానుచెట్టు కింద పంచాంగ శ్రవణం



గుంటుపల్లిలో పంచాంగ శ్రవణం చేస్తున్న నిరంజన్ శాస్త్రి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): శోభకృత్ నామ ఉగాది సందర్భంగా గుంటుపల్లిలో గాయత్రి బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మానుచెట్టు కింద పురోహితులు నిరంజన్ శాస్త్రి గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభించారు. స్థానికులకు పంచాంగ శ్రవణం చేశారు. బెలంకొండ శాస్త్రి సౌజన్యంతో పంచాంగ పుస్తకాలు, ప్రసాదం పంపిణీ చేశారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

నూజివీడు: పట్టణ, మండల ప్రజలు బుధవారం ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. శ్రీశోభకృత్ నామ సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పలు చోట్ల పంచాగ శ్రవణం నిర్వహించారు.

వేద పాఠశాలలో..

ఆగిరిపల్లి: స్థానిక శోభనాద్రి లక్ష్మీ నృసింహ వేదశాస్త్ర పాఠశాలలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. చతుర్వేద పారాయణ, వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో విష్ణుభట్ల లక్ష్మీ నారాయణ ఘనాపాఠి, చల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠి, సుందరరామశ్రౌతిని సత్కరించారు. పాఠశాల కార్యదర్శి సూరి శర్మ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలో అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ గావించారు.

దమ్మన్న మండపం వద్ద..

ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని దమ్మన్న మండపం వద్ద బుధవారం రాత్రి శోభకృత్ నామ ఉగాది సందర్భంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామిని చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవంగా తీసుకొచ్చారు. పంచాంగ శ్రవణాన్ని గ్రామానికి చెందిన అర్చకులు సాంబశివ రావు చదివి వినిపించారు.



తిరువూరు మండలం కాకర్ల రామాలయంలో ప్రత్యేక అలంకరణ



మైలవరం పాండురంగ స్వామి ఆలయంలో పూలతో అలంకరించారు



కొండపల్లిలోని సిద్ధి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

రంజాన్‌కు ఏర్పాట్లు



తిరువూరులోని జామియా మసీదుకు విద్యుద్దీపాలంకరణ

తిరువూరు: రంజాన్ మాస ప్రారంభ సందర్భంగా తిరువూరులోని పలు మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రంజాన్ ఉపవాసదీక్షలు చేపట్టే ముస్లింలకు తిరువూరు జామియా మసీదులో ఇఫ్తార్, సహర్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను మసీదు కమిటీ చేపట్టింది. ఈ నెల 24వ తేదీ నుంచి ఉపవాసదీక్షలు ప్రారంభమవుతాయని ముస్లిం పెద్దలు తెలిపారు. పట్టణంలోని కౌసర్ మసీదు, బిలాల్‌మసీదులతో పాటు ఆంజనేయపురం, మునుకుళ్ల, రాజుగూడెం, గానుగపాడు, రోలుపడి, మల్లేల గ్రామాల్లో రంజాన్ ప్రార్థనల నిర్వహణకు మసీదులను సిద్ధం చేశారు.

ప్యాసింజర్ ట్రైన్ కొండపల్లిలో ఆపాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వే స్టేషన్‌లో డోర్నకల్ 07755 నంబర్ ప్యాసింజర్ ట్రైన్ ఆగేలా చూడాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కరోనాకు ముందు కొండపల్లి స్టేషన్‌లో రైలు నిలిచేదని పేర్కొన్నారు. కరోనా అనంతరం ఆదాయం రాని చెరువు మాధవరం, రాయనపాడు స్టేషన్లల్లో ఆపి లక్ష జనాభా కలిగిన కొండపల్లికి హాల్ట్ ఇవ్వలేదని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతున్న స్టేషన్‌లో డోర్నకల్ ప్యాసింజర్ నిలుపుదల చేయాలని కోరారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మాజీ వార్డు సభ్యుడు రాయపూడి వెంకటరావు ఆధ్వర్యంలో 17వ వార్డులో పేదలకు నిత్యావసర సరకులు బుధవారం పంపిణీ చేశారు. ఉగాదిని పురస్కరించుకుని పేదలకు ఇంటింటికీ వెళ్లి, బియ్యం, సరుకులు అందజేశారు.

మామిడి మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోండి



మామిడి ముక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఏఎంసీ కార్యదర్శి మహాలక్ష్మి

ఆగిరిపల్లి: స్థానిక మార్కెట్ యార్డులో మామిడి రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మామిడి మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు ఏఎంసీ కార్యదర్శి యు.మహాలక్ష్మి పేర్కొన్నారు. మామిడికాయల మార్కెట్‌ను ఆమె బుధవారం సందర్శించారు. మండలంలోని రైతులు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కోరగా ఈ మార్కెట్ యార్డులో మామిడికాయలు విక్రయించేలా ఏర్పాటు చేయించారని తెలిపారు. ప్రస్తుతం నాలుగు మామిడి క్రయ విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారని, మరో నాలుగు దుకాణాలు ఏర్పాటుకు మామిడి రైతులు ముందుకొచ్చినట్టు పేర్కొన్నారు. ఈ యార్డులో మామిడికాయల వాహనాలను తూకం వేసేందుకు 50 టన్నుల వేబ్రిడ్జిని ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీని కోరుతూ కార్యదర్శికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ మామిడి ముక్కల ప్రాసెసింగ్ యూనిట్, మామిడి కాయల గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, వడ్లమాను ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఎస్.రాంబాబు, మాజీ సర్పంచ్ జలసూత్రం కృష్ణమూర్తి, కుప్పాల నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విగ్రహానికి సంబంధించి డిజైన్లను ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లతో పాటు పరిశీలించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మాణ పనులు జరగాలని ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె అంబేడ్కర్ విగ్రహ భాగాలు జాగ్రత్తగా నిర్మాణం చేయాలని, అనుకున్న సమయానికి అంబేడ్కర్ స్మృతివనం, ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులు సైతం సమయంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు విగ్రహం కింద భాగంలో రెస్టారెంట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, మిని థియేటర్, ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఆర్డీఏ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆదర్శ్ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామకృష్ణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ రామకృష్ణ మాట్లాడుతూ.. నీటి నిల్వలను పెంచుకుంటూ భావితరాల వారికి సురక్షితమైన నీటిని అందించాలన్నారు. భూమి మీద మానవులు జీవించడానికి నీరు ఎంతో అవసరమని చెప్పారు. జనాభా పెరిగే కొద్ది నీటి వినియోగం ఎక్కువై కొరత ఏర్పడుతోందన్నారు. నేడు 663 మిలియన్లకు పైగా ప్రజలు తమ ఇళ్ళకు సమీపంలో సురక్షితమైన నీటి సరఫరా లేక సంక్షోభంలో జీవిస్తున్నారన్నారు. భూమిపై ప్రాణాలు కాపాడేందుకు నీటిని ఆదా చేయడం మనందరి బాధ్యత అన్నారు. నీటి బ్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతోనే మార్పు



మాట్లాడుతున్న దీప్తి ప్రసన్న

రామవరప్పాడు: ధ్యాన సాధనతో మంచి మార్పు, మానవత్వం, భౌతిక, ఆధ్యాత్మిక భావాలు సొంతమవుతాయని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి దీప్తి ప్రసన్న అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ శక్తి కల్యాణ మంటపంలో బుధవారం శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురు విశ్వస్ఫూర్తి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గురు విశ్వస్ఫూర్తి మానవాళికి అనుగ్రహించిన ‘ధ్యాన మనో ప్రస్థాన సాధన’ ప్రదర్శన నిర్వహించారు. సభాధ్యక్షుడు పైడిపాటి ఉమానాథ శర్మ మాట్లాడుతూ ధ్యాన మనో ప్రస్థాన సాధనతో మనస్సు, బుద్ధి, ఆత్మ స్పష్టతతో మనిషి తనను తాను తెలుసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆథర్ మేక రజనీకాంత్, సత్యవతి, ట్రస్టీలు భానుకృష్ణ, ప్రసాద్, రాఘవరావు, సౌజన్యశ్రీ, జోనల్ ఇన్చార్జి రత్న కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శైలజారెడ్డికి సత్కారం



శైలజారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

జీకొత్తూరు(తిరువూరు): నీట్ పీజీ మెడిసిన్ ప్రవేశ పరీక్షలో అఖిలభారత స్థాయిలో 300వ ర్యాంకు సాధించిన మండలంలోని జీ కొత్తూరుకు చెందిన యరమల శైలజారెడ్డిని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ ప్రతినిధులు బుధవారం సన్మానించారు. జీకొత్తూరులోని ఆమె నివాసంలో కలిసిన సంఘ కన్వీనర్ రాంప్రదీప్ తదితరులు శైలజారెడ్డికి శాలువా కప్పి జ్ఞాపిక బహూకరించారు. ఎంపీటీసీ సభ్యురాలు యరమల రాధ పాల్గొన్నారు.

సూర్యారాధన శ్రేయోదాయకం



విజయవాడ కల్చరల్: సూర్యారాధన శ్రేయోదాయకమని, నిత్య పూజలతో తరించాలని దెందుకూరు సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సూర్యారాధన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య శాస్త్రి సూర్యారాధన విశిష్టతను వివరించారు. భారతీయ ధర్మంలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందన్నారు. వేదాలలోనూ సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందని చెప్పారు. దేవాలయ ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లోక శాంతికోసం జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి ఆదేశాలతో సూర్యారాధన నిర్వహిస్తున్నామన్నారు. సూర్యారాధన, సూర్య నమస్కారాల వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.చంటిబాబు బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌పి పేట గ్రామంలో కోడిపందేలపై దాడులు నిర్వహించి ఆరుగురుని అదుపులోకి తీసుకుని, రూ.1,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కోడి పందేలపై దాడులు

ముసునూరు: రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించి, ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. రూ.17,200, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. చెక్కపల్లిలో ఇద్దర్ని అరెస్ట్ చేసి రూ.2,000, ఒక కోడి పుంజు, సూరేపల్లిలో ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.15,200, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరిని గురువారం నూజివీడు కోర్టుకు హాజరుపరచనున్నట్టు పేర్కొన్నారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన కుంభ గాయత్రి వంట పనులు చేస్తుంది. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి భార్యను అనుమానించడం, వేధించడం చేస్తున్నాడు. ఆర్నెల్లుగా వేధిస్తుండడంతో గతంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది. కౌన్సెలింగ్‌కు పంపగా సక్రమంగా కాపురం చేసుకుంటామని అంగీకరించాడు. రెండు నెలలుగా మరలా వేధింపులు ప్రారంభించాడు. దీంతో ఆమె భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ధన ధాన్యలక్ష్మి అలంకారంలో కాళీమాత



కృష్ణలంక(విజయవాడతూర్పు): శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు ధన ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శిష్టానారాయణ శాస్త్రిచే పంచాంగ శ్రవణం జరిపించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు వసంత నవరాత్రుల సందర్భంగా మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు నిత్య అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తున్నామని తెలిపారు. అభిషేకం, పుష్పార్చనలో పాల్గొనదలిచే భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

గన్నవరం: ఆరోగ్యకరమైన నవ సమాజం కోసం యువత క్రీడలపై దృష్టి సారించాలని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కె.ప్రసాద్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ప్రారంభించిన టీఎస్ఆర్‌కే మాట్లాడుతూ..రానున్న రోజుల్లో క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు మరిన్ని పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోటీల స్పాన్సర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సంకాబత్తు వెంకట్‌ను అభినందించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతగా నిలిచిన గన్నవరం పోలీసుల జట్టుకు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు, హెచ్‌సీఎల్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఏసీబీ సీఐ వెంకటరమణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్.కిషోర్, రోటరీక్లబ్ కార్యదర్శి రవిబాబు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగాలు మరువలేం

నూజివీడు: స్వాతంత్రోద్యమం, తర్వాత దేశ పునర్నిర్మాణం, ఆర్థిక సామాజిక ఉద్యమాల నిర్వహణలో కమ్యూనిస్టుల త్యాగాలను మరువలేమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు. నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో అమరవీరుల స్మారక గ్రంథాలయం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు చలసాని రాజగోపాల్‌రావు, బొబ్బా వెంకటేశ్వరరావుల 73వ వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి ఈమని శేషయ్య భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేశారు. మృత వీరులకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ చలసాని రాజగోపాల్‌రావు నూజివీడు ప్రాంతంలో స్వాతంత్ర ఉద్యమంలో 1940 దశకంలో పలు ఉద్యమాల్లో పాల్గొని లాఠీ దెబ్బలకు గురయ్యారని, పలుసార్లు అరెస్టు అయ్యారని గుర్తుచేశారు. 1950 ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురై ఉన్న రోజులలో ఉగాది పండుగ రోజున రాజగోపాలరావుని అన్నవరం అటవీ ప్రాంతంలో పోలీసులు కాల్చి చంపారని తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, అన్నవరం ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య, రైతు నాయకులు నరేంద్ర, సూర్యనారాయణ, నాగరాజు, ప్రకాశరావు పాల్గొన్నారు.